

డ్రగ్ అధికారుల తనిఖీలు
జిల్లా ఔషధ నియంత్రణ అధికారులు శుక్రవారం కోదాడలో తనిఖీలు చేశారు. మందుల గోదామును సీజ్ చేశారు. - 8లో



సరిహద్దు చెక్‌పోస్ట్ తనిఖీ
తెలుగు రాష్ట్రాల పోలీస్ ఉన్నతాధికారులు శుక్రవారం రామాపురం క్రాస్ రోడ్డులోని సరిహద్దు చెక్‌పోస్టును తనిఖీ చేశారు. - 10లో

రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6-34 (శనివారం సా॥)
సహర్ 4-55 (ఆదివారం ఉ॥)

అందని వడ్డీ డబ్బులు

మహిళా సంఘాలకు బకాయి రూ.123.63 కోట్లు

- నాలుగేళ్లుగా విడుదల చేయని రాష్ట్ర ప్రభుత్వం
- ఎదురుచూపుల్లో మహిళలు
- కొత్త ప్రభుత్వంపైనే ఆశలు



దురాజ్‌పల్లి (సూర్యాపేట): క్రమం తప్పకుండా పొదుపుతోపాటు రుణ బకాయిలు, వడ్డీ చెల్లించే మహిళా సంఘాల సభ్యులకు ప్రభుత్వం ఇస్తామన్న వడ్డీ నిధులు అందడం లేదు. ప్రభుత్వం వడ్డీ బకాయిలు ఇస్తే కుటుంబ, వ్యాపార అవసరాలకు వినియోగించుకోవచ్చని మహిళలు భావిస్తున్నా వారి ఆశలు అడియాసలుగా మారాయి. నాలుగు సంవత్సరాలుగా వడ్డీ బకాయిలు రాకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లోని స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులు ఆందోళన చెందుతున్నారు. తాజాగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సైతం వడ్డీలేని రుణాలను మంజూరు చేస్తామని ప్రకటించడంతో పాత బకాయిలను కూడా చెల్లిస్తారని మహిళలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

రూ.123.63 కోట్లు బకాయి
స్వయం సహాయక సంఘాల మహిళలను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రభుత్వం బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేస్తోంది. అయితే ఈ రుణాలను సభ్యులు వడ్డీతో సహా చెల్లిస్తుండగా.. తిరిగి వడ్డీ మొత్తాన్ని ప్రభుత్వం సభ్యుల ఖాతాల్లో జమ చేయాలి. కానీ నాలుగేళ్లుగా ఈ ప్రక్రియ జరగడం లేదు. జిల్లాలో 475 పంచాయతీల్లో 27,773 స్వయం సహాయక సంఘాలు ఉండగా, వీటిలో 2.80 లక్షల మంది సభ్యులు కొనసాగుతున్నారు. జిల్లాలోని సభ్యులకు రూ.123.63 కోట్ల మేర వడ్డీ బకాయిలు అందాల్సిఉంది.

2013 నుంచి వడ్డీలేని రుణాలు
మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందించాలని 2013లో అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. అప్పటి వరకు ఉన్న పాత గ్రూపులతో పాటు కొత్తగా ఏర్పడిన గ్రూపులకు సైతం వడ్డీలేని రుణాల మంజూరు మొదలైంది. గ్రూపు సభ్యులు తొలుత వడ్డీతో రుణాన్ని బ్యాంకుల్లో జమ చేయగానే.. ఆ వడ్డీ తిరిగి గ్రూపు ఖాతాకు మళ్లిస్తారు. ఈ మొత్తాన్ని సభ్యులు తీసుకున్న రుణం ఆధారంగా పంచుకుంటారు. కానీ ప్రభుత్వం నుంచి వడ్డీ రాకపోవడంతో సభ్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రావాల్సిన వడ్డీ బకాయిలు సంవత్సరం వారీగా..

సంవత్సరం	సంఘాలు	అందాల్సిన వడ్డీ (రూ.కోట్లలో.)
2019-20	14,055	30.66
2020-21	14,214	30.64
2021-22	14,623	31.99
2022-23	14,573	30.34

నాలుగేళ్లుగా బకాయిలు
స్వయం సహాయక సంఘాల మహిళలకు గతంలో కొంత ఆలస్యంగానైనా వారి ఖాతాల్లో వడ్డీ డబ్బులు జమ చేసేవారు. ప్రతి ఆరు నెలలకోసారి మహిళా సంఘాలు చెల్లించిన రుణం, వడ్డీని లెక్కించి అర్హులైన సంఘాలకు వడ్డీ తిరిగి చెల్లించేవారు. అయితే నాలుగైదేళ్లుగా వడ్డీ సమయానికి చెల్లించడంలేదు. 2016-17, 2017-18 ఏడాదికి సంబంధించిన వడ్డీ నగదు 2022లో విడుదలవగా.. 2018-19, 2019-20కి కొంత మేరకు వడ్డీ బకాయిలు 2023 ఏడాదిలో విడుదలయ్యాయి. ఇక, 2019-20 కొంత మేరకు 2020-21 ఏడాది నుంచి ఇప్పటి వరకు బకాయిలు అసలే రావడం లేదు. ఇదిలా ఉంటే 2023-24 ఏడాదికి వడ్డీ బకాయి లెక్కించలేదు.

న్యూస్‌రీల్

ప్రైవేట్ ఆస్పత్రులపై వైద్యారోగ్యశాఖ దాడులు


జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

సూర్యాపేట: అవసరం లేకున్నా ఆపరేషన్లు చేసి కాన్పులు చేస్తున్న జిల్లా కేంద్రంలోని పలు ఆస్పత్రులపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ శుక్రవారం దాడులు చేసింది. 'కాన్పుకెళ్తే కోతలే' అనే శీర్షికన ఈ నెల 21న 'సాక్షి'లో ప్రచురితమైన ప్రత్యేక కథనానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పందించారు. పట్టణంలోని పలు ఆస్పత్రుల్లో సిజేరియన్ కాన్పులు, అబార్షన్ రికార్డుల స్వాధీనం చేసుకున్నారు. సాధారణకాన్పులు జరిగే అవకాశమున్నా ఆపరేషన్లు చేస్తున్నారన్న అనుమానంపై దాడులు చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కోటాచలం స్వయంగా పలు ఆస్పత్రులకు నోటీసులను అందించారు. ఇప్పటి వరకు ఎనిమిది ఆస్పత్రుల్లో అధికంగా ఆపరేషన్లు చేసి కాన్పులు చేసినట్టు గుర్తించామని డీఎంహెచ్‌ఓం ఈ సందర్భంగా పేర్కొన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌లో శిక్షణ

నల్లగొండ: నిరుద్యోగులకు శిక్షణ, ఉపాధి అవకాశాల కోసం డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్, గ్రో ప్రోగ్రామ్ ఆధ్వర్యంలో కంప్యూటర్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై రెండు నెలల పాటు శిక్షణనిస్తున్నట్లు ఆ సంస్థ నిర్వాహకురాలు అల్మస్ ఫర్హీన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ ఆపరేటర్, స్పోకెన్ ఇంగ్లిష్, సాఫ్ట్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, టైపింగ్, ఆప్టిట్యూడ్, సెక్టార్ రెడీనెస్, ఇంటర్వ్యూ స్కిల్స్ తదితర అంశాలపై శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. పదో తరగతి నుంచి డిగ్రీ వరకు అర్హత గల, వయసు 18 నుంచి 30 సంవత్సరాల లోపు వయస్సువారు ఈ నెల 28వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు పూర్తి వివరాలకు సెల్ : 7032649925, 9177785283 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి


మాట్లాడుతున్న మల్లు నాగార్జున్‌రెడ్డి

దురాజ్‌పల్లి (సూర్యాపేట): యాసంగి ధాన్యం చేతికి వస్తునందన అన్ని గ్రామాల్లో ధాన్యం కేంద్రాలు ఏర్పాటు చేసి కొనుగోళ్లు ప్రారంభించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం మూలంగా రైతులు ధాన్యాన్ని మధ్యదళారులకు అమ్ముతూ మద్దతు ధర లభించక తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన బోనస్ కూడా ఈ యాసంగిలోనే ఇవ్వాలని కోరారు. జిల్లాలో తాగునీటి ఎద్దడి గల గ్రామాల్లో అద్దె బోర్ల ద్వారా ప్రజలకు నీరందించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కోలిశెట్టి యాదగిరిరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, మట్టిపల్లి సైదులు, కోట గోపి తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో ఊంజలి సేవ

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం ఊంజలి సేవ ఆగమశాస్త్ర ప్రకారం నిర్వహించారు. సాయంత్రం వేళ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయ తిరు, మాఢ వీధుల్లో ఊరేగించారు. అనంతరం అద్దాల మండపంలో అధిష్టింపజేసి ఊంజలి సేవోత్సవం నిర్వహించారు. మహిళా భక్తులు అమ్మవారికి మంగళహారతులతో స్వాగతం పలికారు.


అమ్మవారి సేవను ఊరేగిస్తున్న అర్చకులు

జీవకోటికి నీరే ప్రాణాధారం



ఇంకుడు గుంతల ఏర్పాటుపై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ వెంకటరావు

- భవిష్యత్ తరాలకోసం నీటి వనరులను కాపాడాలి
- ప్రతి ఇంటి ముందు ఇంకుడు గుంత ఉండాలి
- కలెక్టర్ వెంకటరావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): జీవకోటికి నీరే ప్రాణాధారమని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటరావు అన్నారు. శుక్రవారం ప్రపంచ నీటి దినోత్సవ సందర్భంగా జిల్లా కలెక్టరేట్ ఉద్యోగులకు ఇంకుడు గుంతల నిర్వహణపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో అన్ని గ్రామాలు, మున్సిపాలిటీల్లో ప్రతి ఇంటిలో ఇంకుడు గుంత ఉంటేలా అధికారులు అవగాహన కల్పించాలన్నారు. భవిష్యత్ తరాల కోసం నీటి వనరులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. నీరు వృథాగా పోకుండా ప్రతి ఇంటిముందు ఇంకుడు గుంత నిర్మించుకోవాలని సూచించారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ప్రతి ఒక్కరితో నీరు పోసి మొక్కని కాపాడాలని, ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలనే నినాదంతో ముందుకెళ్లాలన్నారు. అనంతరం ఉద్యోగులతో నీటి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు, జెడ్పీ సీఈఓ వీవీ.అప్పారావు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, కలెక్టరేట్ ఏఓ సుదర్శన్‌రెడ్డి, సూపరిటేడెంట్ పద్మారావు, ఎన్నికల పర్యవేక్షకులు శ్రీనివాసరాజు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.


గ్రీవెన్స్ కమిటీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

'గ్రీవెన్స్' కార్యాలయం ప్రారంభం
పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయం గ్రౌండ్ ఫ్లోర్‌లోని ఎ-38 రూమ్‌లో గ్రీవెన్స్ కమిటీ కార్యాలయాన్ని కలెక్టర్ వెంకటరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తనిఖీల్లో భాగంగా సీజ్ అయిన నగదు విడుదల కోసం గ్రీవెన్స్ కమిటీ కార్యాలయం ఏర్పాటు చేశామని తెలిపారు. నిబంధనలు అతిక్రమించి ఎక్కువ మొత్తంలో నగదు దొరికితే ఆ మొత్తాన్ని సీజ్ చేసి జిల్లా ట్రెజరీలో జమ చేస్తారన్నారు. జిల్లా గ్రీవెన్స్ కమిటీ కార్యాలయ ఇన్‌చార్జి జెడ్పీ సీఈఓ సెల్ : 83745 66222 నంబర్‌ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లత, జెడ్పీ సీఈఓ అప్పారావు, డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు, జెడ్పీ డిప్యూటీ సీఈఓ శిరీష, ఏఓ సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

యురేనియం అలజడి!


ఏరియల్ సర్వే సాగుతున్న నల్లమల అటవీ పాంతంలోని గుట్టలు



ఏరియల్ సర్వేకు వినియోగిస్తున్న చాపర్

- నాగార్జునసాగర్ పరిసరాల్లో నిక్షేపాల అన్వేషణ
- పది రోజులుగా యూసీఐఎల్ అధికారులు రాకపోకలు
- రెండు చాపర్ల ద్వారా ఏరియల్ సర్వే
- ఆందోళనలో సాగర్ పరిసర ప్రాంత ప్రజలు

నాగార్జునసాగర్: నల్లమల అటవీ ప్రాంతంలో యురేనియం నిక్షేపాల కోసం అన్వేషణ మళ్లీ మొదలైంది. కొంతకాలంగా పలువురు శాస్త్రవేత్తలు నాగార్జునసాగర్‌లోని విజయవిహార్ అతిథిగృహంలో బస చేస్తూ.. నాగార్జునసాగర్ రైట్‌బ్యాంక్ సమీపంలో ఆంధ్రా వైపున ప్లెటైక్ ఎరోడ్రమ్‌లో రెండు చాపర్లను పెట్టుకుని ఏరియల్ సర్వే నిర్వహిస్తున్నారు. అయితే వారు ఇతర ఖనిజాల కోసం సర్వే జరుపుతున్నట్లు చెబుతూ వస్తున్నారు. ఇటీవల కృష్ణా తీరాన అమ్రాబాద్ అటవీ ప్రాంతంలో చాపర్ల ద్వారా సర్వే నిర్వహించారు. పది రోజులుగా యూసీఐఎల్ (యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) అధికారులు ఈ ప్రాంతంలో పర్యటిస్తుండటంతో అన్వేషణ కొనసాగుతున్నట్లు ప్రజలు భావిస్తున్నారు.

కృష్ణాతీరంలో యురేనియం నిక్షేపాలు
గతంలోనే ఈ ప్రాంతంలో సర్వే నిర్వహించిన శాస్త్రవేత్తలు వేల ఎకరాల్లో యురేనియం నిక్షేపాలు ఉన్నట్లు వెల్లడించారు. పెద్దవూర మండలంలోని పులిచర్ల సమీపంలోగల కేకేతండా వద్ద క్యాంపు ఏర్పాటు చేసుకుని పెద్దఅడిశర్లపల్లి మండలంలోని పెద్దగట్టుపై డ్రిల్లింగ్ చేసి శాంపిల్స్ తీసి శాస్త్రవేత్తలకు పంపేవారు. ఆ విధంగా సంవత్సరాల తరబడి సర్వేలు నిర్వహించారు. నల్లగొండ జిల్లా చందంపేట మండలం చిత్రియాల గుట్టలు, పెద్దమూల గ్రామంలో వెయ్యి హెక్టార్లలో, పెద్దఅడిశర్లపల్లి మండలంలో 1104.64 ఎకరాల అటవీ భూమిలో, 196.71 ఎకరాల పట్టా భూముల్లో యురేనియం నిల్వలు ఉన్నట్లు యూసీఐఎల్ అధికారులు ధ్రువీకరించారు. దీంతో ఇదే ప్రాంతంలోని మల్లాపురంలో రాతినుంచి యురేనియం వేరు చేసే కార్మాగారాన్ని నెలకొల్పేందుకు భూసేకరణ మొదలుపెట్టారు. ఇక్కడ ప్రభుత్వ భూమి లేకపోవడంతో ఈ కర్మాగారాన్ని దేవరకొండ మండలం శేరిపల్లి వద్ద పెట్టేందుకు 200 ఎకరాల భూమిని సేకరించారు. 2003 సంవత్సరంలలో పెద్దఅడిశర్లపల్లిలో ఆనాటి నల్లగొండ కలెక్టర్ ప్రజాభిప్రాయ సేకరణ కూడా చేశారు. ఆ తర్వాత ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో సద్దుమణిగింది.

ప్రజల్లో భయం గూడుకట్టుకుంది
యురేనియం వెలికితీతతో రేడియేషన్ బయటకు వచ్చి ప్రాణాలకే ప్రమాదం జరుగుతందని ప్రజల్లో భయం ఉంది. ఈ గుట్టల నుంచి వర్షపు నీరంతా నాగార్జునసాగర్ జలాశయంలో కలుస్తుంది. ఇక్కడ యురేనియం తీస్తే తాగు, సాగునీరు కలుషితమై ప్రాణాంతకమైన వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంటుందని ప్రజలు భయపడుతున్నారు. దీంతో యురేనియం వెలికితీతను వ్యతిరేకిస్తూ గతంలోనే పెద్ద ఉద్యమాలు చేపట్టారు.

తాగునీటి ఎద్దడిని నివారించాలి

పెన్‌పహాడ్, చివ్వెంల: గ్రామాల్లో తాగునీటి ఎద్దడిని నివారించాలని డీపీఓ సురేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం పెన్‌పహాడ్ మండలం అనంతారం గ్రామంలో గ్రీన్ డేలో భాగంగా మొక్కలకు నీరు పెట్టారు. పశువుల తొట్లలో నీళ్లు నింపడాన్ని పరిశీలించారు. అలాగే చివ్వెంల మండలం బి.చందుపట్ల గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో ఉన్న నర్సరీ, ప్రకృతి వనాల్లోని మొక్కలకు రోజూ నీరు పెట్టాలని తెలిపారు. వేసవిలో పశువులకి నీరు అందుబాటులో ఉంచాలని సూచించారు. బి.చందుపట్ల గ్రామంలో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య, ఇంటి పన్నుల వసూల వివరాలను కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమాల్లో పెన్‌పహాడ్, చివ్వెల ఎంపీఓలు నరేష్, టి.గోపి, పంచాయతీ కార్యదర్శి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.


చివ్వెంల : బి.చందుపట్లలో కార్యదర్శిని వివరాలు అడుగుతున్న డీపీఓ

మట్టపల్లి హుండీ ఆదాయం రూ.8.33 లక్షలు

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీలను శుక్రవారం జిల్లా ఎండోమెంట్ అధికారుల పర్యవేక్షణలో లెక్కించారు. 69 రోజులకు గాను ప్రధాన హుండీల ద్వారా రూ.7,83,396, అన్నదానం హుండీ ద్వారా రూ.50,060తో కలిపి మొత్తం రూ.8,33,456 ఆదాయం సమకూరినట్టు ఆలయ అనువంశిక ధర్మకర్తలు, ఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయ అధికారి ఎస్.నిఖిల్, పాలకవర్గ సభ్యులు, సాయి సేవా సంఘం సభ్యులు, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం
మట్టపల్లి క్షేత్రంలో శుక్రవారం నిత్య పూజల అనంతరం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, టీటీడీ బోర్డు డైరెక్టర్, హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రాంరెడ్డి, ఎస్ఎస్ఆర్, అంబటి శ్రీనివాసరెడ్డి, అర్చకులు అద్దేపల్లి లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.


హుండీలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

28న కోదాడ బార్ అసోసియేషన్ ఎన్నికలు

కోదాడ: కోదాడ బార్ అసోసియేషన్ కార్యవర్గంలో వివిధ పదవులకు ఈ నెల 28న ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారులు వేజేళ్ల రంగారావు, షేక్ జానిపాషా, ఆవుల మల్లిఖార్జునరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యక్ష పదవికి ఎస్ఆర్‌కే.మూర్తి, నాళం రాజన్న పోటీ పడుతుంగా, లైబ్రరీ కార్యదర్శి పదవికి మంద వెంకటేశ్వర్లు, షేక్ కరీముల్లా, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శి పదవికి వేల్పుల మోష, పోలూరి హేమలత, 1వ కార్యవర్గ సభ్యుడి పదవికి దొడ్డా శ్రీధర్, మహ్మద్ హుస్సేన్‌లు పోటీ పడుతున్నారని పేర్కొన్నారు. మిగతా పదవులకు ఏకగ్రీవంగా ఎన్నిక జరిగినట్లు తెలిపారు.

నీటి సమస్య తలెత్తకుండా చూడాలి

- జెడ్పీ సీఈఓ అప్పారావు

అర్వపల్లి: వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా చూడాలని అధికారులను జెడ్పీ సీఈఓ అప్పారావు ఆదేశించారు. శుక్రవారం అర్వపల్లి గ్రామ పంచాయతీ ఆవాసం గోపాలపురం, భాగ్యనగర్‌ను సందర్శించి నీటి సమస్య గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిషన్ భగీరథ నీళ్ల రాక గోపాలపురంలో నీటి సమస్య తలెత్తగా ట్యాంకర్ ద్వారాసరఫరా చేపట్టినట్లు చెప్పారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో పనిచేయని చేతిపంపులను యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించాలని పేర్కొన్నారు. రక్షిత మంచినీటి పథకాలు పనిచేసేలా చూడాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ డి.సందీప్‌కుమార్, ఏఈ మహేష్, కార్యదర్శి శ్రావణి ఉన్నారు.


గోపాలపురంలో నీటి సరఫరాను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ అప్పారావు తదితరులు

జీజీహెచ్ సూపరింటెండెంట్‌ను బదిలీ చేయొద్దు



ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న వైద్యశాఖ ఉద్యోగులు, సిబ్బంది

సూర్యాపేట: సూర్యాపేట జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్) సూపరింటెండెంట్ దండ మురళీధర్‌రెడ్డి చేయొద్దంటూ ఉద్యోగులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆస్పత్రి వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ రాజకీయ జోక్యంతోనే మురళీధర్‌రెడ్డిని అక్రమంగా బదిలీ చేశారని ఆరోపించారు. కరోనా సమయంలో వెలకట్టలేని వైద్యసేవలు అందించిన ఘనత మురళీధర్‌రెడ్డిదే అన్నారు. ఇప్పటికీ ఆస్పత్రిలో పేదలకు విలువైన వైద్యసేవలను అందిస్తున్నారని గుర్తుచేశారు. రాజకీయ నిరుద్యోగులు వైద్య వృత్తిని కలుషితం చేయవద్దంటూ వేడుకున్నారు. మా ప్రాంతం డాక్టర్ మాకే కావాలంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

బదిలీ సరైందేనంటూ మరికొందరు..
ఇదిలా ఉంటే సూపరింటెండెంట్ మురళీధర్‌రెడ్డి బదిలీ సరైందేనని, తమను అన్యాయంగా ఉద్యోగాల నుంచి తొలగించారని ఆరోపిస్తూ కొందరు బాధితులు శుక్రవారం ఆస్పత్రి ఎదుట నిరసనకు దిగారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ అన్ని ఆధారాలతో హైదరాబాద్‌లో ఆయనపై ఫిర్యాదు చేశామన్నారు. కొందరిని తన అనుచరులుగా మార్చుకొని ధర్నా చేయిస్తున్నారన్నారు.

ఆటోనగర్‌కు మోక్షం లభించేనా!

- ఇమాంపేటలో శంకుస్థాపన చేసిన గత ప్రభుత్వం
- ప్రతిపాదనల వద్దే ఇండస్ట్రియల్ పార్కు
- నేటికీ మొదలుకాని పనులు
- ఇవి పూర్తయితే 10వేల మందికి ఉపాధి అవకాశం
- ప్రభుత్వ నిర్ణయం కోసం నిరీక్షణ


ఇమాంపేటలో ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటరావు (ఫైల్)

దురాజ్‌పల్లి (సూర్యాపేట): సూర్యాపేట పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలనే సంకల్పంతో ఏర్పాటు చేయాలని నిర్ణయించిన ఆటోనగర్, ఇండస్ట్రియల్ పార్కుకు ఇప్పట్లో మోక్షం కలిగేలా కనిపించడం లేదు. ఏళ్ల కాలం నుంచి కలగా ఉన్న ఆటోనగర్, ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు 2023 ఆగస్టులో అడుగులు పడ్డాయి. ముందుగా ఆటోనగర్ ఏర్పాటుకు శంకుస్థాపన చేయగా, ఇండస్ట్రియల్ పార్కుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కానీ నేటికీ ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా పనులు ఒక్క అడుగుకూడా ముందుకు సాగలేదు.

102 ఎకరాల్లో..
జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న సూర్యాపేట రూరల్ మండలం ఇమాంపేటలో ఆటోనగర్ నిర్మాణానికి అప్పటి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి 2023 ఆగస్టులో శంకుస్థాపన చేశారు. సుమారు 102 ఎకరాల్లో ఆటోనగర్, ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయాలని నిర్ణయించి 33.24 ఎకరాల భూమి సేకరించారు. ఈ భూమి తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్‌కు అప్పగించారు. ఇంకా 69.16 ఎకరాల భూమి సేకరించాల్సి ఉండగా ల్యాండ్ ఎక్విజేషన్ చేయాలని నిర్ణయించారు. ఇండస్ట్రియల్ పార్కు, ఆటోనగర్ ఏర్పాటుకు రూ.16కోట్ల నిధులు అవసరమని ప్రాథమికంగా అంచనా వేసి అప్పటి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఆటోనగర్‌లో ఈఎస్ఐ ఆస్పత్రి, కార్మిక సంక్షేమ భవనం, ప్రధాన రహదారి నుంచి చివరి వరకు విశాలమైన రోడ్లు, కమాన్ నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ రెండు ప్రతిపాదనలు ఒకేచోట ఉండడంతో ఉపాధికి కేరాఫ్‌గా ఇమాంపేట మారతుందని అందరూ భావించారు. అయితే కొన్ని రోజులు అధికారులు హడావుడి చేసి తరువాత పట్టించుకోలేదు. ఇది పూర్తయితే దాదాపు 10వేల మందికి ఉపాధి లభించే అవకాశం ఉంది.

ఏళ్ల కల నెరవేరేదెప్పుడు..
ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనే సూర్యాపేట అతిపెద్ద పట్టణం. అంతేకాకుండా పట్టణం మీదుగా జాతీయ రహదారి వెళ్తుండడంతో వ్యాపారపరంగా కూడా అగ్రగామిగా మారింది. ఇక్కడ దాదాపు నాలుగైదు దశాబ్దాల నుంచి చిన్న, పెద్ద వాహనాలు భారీగా ఉండగా మెకానిక్‌లు సైతం అదే స్థాయిలో జీవనోపాధి పొందుతున్నారు. దాంతో ఏళ్లుగా మెకానిక్‌లు ఇక్కడ ఆటోనగర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ వస్తున్నారు. అంతే కాకుండా ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుతో చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటైతే వేలాది మందికి స్వయం ఉపాధి దొరికేది. గత ప్రభుత్వం జిల్లా కేంద్రంలో ఇండస్ట్రియల్ పార్కు, ఆటోనగర్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేసినా ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని ప్రజలు కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు.

క్లుప్తంగా

బేతవోలులో చోరీ

చిలుకూరు(కోదాడ): గుర్తుతెలియని వ్యక్తులు పట్టపగలే చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన చిలుకూరు మండలంలోని బేతవోలులో శుక్రవారం జరిగింది. చిలుకూరు ఎస్‌ఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. బేతవోలు గ్రామానికి చెందిన మోదుగు విమలమ్మ ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లింది. ఈ లోగా గుర్తుతెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న ఐదు తులాల బంగారు నగలు, పది తులాల వెండి కడియం దొంగిలించారు. బాధితురాలు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంఘటన స్థలాన్ని పరిశీలించారు. గ్రామంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురు మైనర్లను విచారించగా చోరీకి పాల్పడినట్లు గుర్తించి సొత్తును రికవరీ చేశారు. ముగ్గురిని కోదాడ కోర్టులో రిమాండ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అగ్ని ప్రమాదంలో ఆరు గుడిసెలు దగ్ధం

గుర్రంపోడు : మండలంలోని ఘనీరాంతండాలో శుక్రవారం జరిగిన అగ్నిప్రమాదంలో ఆరు గుడిసెలు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన మోగావత్ పాండు, మెగావత్ గణేష్, మెగావత్ బాలు, మెగావత్ రవి, మెగావత్ జాన్యలకు చెందిన గుడిసెలు అగ్నికి ఆహుతయ్యాయి. ఆయా గుడిసెల్లోని వంట సామగ్రి, డ్రిప్, ఇతర వ్యవసాయ పనిముట్లు కాలిపోయాయి. సుమారు ఆరులక్షల నష్టం జరిగిందని, బాధిత కుటుంబాలను ఆదుకోవాలని మాజీ సర్పంచ్ వడిత్య రజితా నాగరాజు అధికారులను కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

పెద్దవూర: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం రాత్రి పెద్దవూర మండలంలోని నాయినివానికుంట గ్రామ స్టేజీ వద్ద చోటు చేసుకుంది. నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని హిల్‌కాలనీకి చెందిన నూకం అఖిల్ (17), పల్లవల కార్తీక్‌లు స్నేహితులు. వీరిద్దరు నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు రాశారు. ఇద్దరు శుక్రవారం రాత్రి బైక్‌పై పెద్దవూరకు బయలుదేరారు. పెద్దవూర నుంచి నాయినివానికుంట వైపు వెళ్తున్న ట్రాక్టర్ నాగార్జునసాగర్ -హైదరాబాద్ ప్రధాన రహదారిపై నుంచి మండల కేంద్రం సమీపంలోని నాయినివానికుంట స్టేజీ వైపు డ్రైవర్ పోనిచ్చాడు. ఈ ప్రదేశంలో మూల మలుపు ఉండటం, అదే సమయంలో పెద్దవూర వైపు వెళ్తున్న నూకం అఖిల్, కార్తీక్‌లు ప్రయాణిస్తున్న బైక్ ట్రాక్టర్ ట్రాలీని ఢీ కొట్టి రోడ్డుపై పడిపోయారు. దీంతో తలకు, చాతికి తీవ్ర గాయాలై నూకం అఖిల్ మృతిచెందగా, కార్తీక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కార్తీక్‌ను నాగార్జునసాగర్ కమలానెహ్రూ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం నల్లగొండకు తరలించినట్లు తెలిసింది. అఖిల్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సాగర్ కమలానెహ్రూ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

డబ్బు కాజేసిందనే చంపేశాడు !

- వీడిన మహిళ హత్య కేసు మిస్టరీ
- నిందితుడి అరెస్ట్, రిమాండ్
- వివరాలు వెల్లడించిన దేవరకొండ డీఎస్పీ గిరిబాబు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గిరిబాబు

కొండమల్లేపల్లి : దేవరకొండలో ఈ నెల 14న వెలుగు చూసిన మహిళ హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. మద్యం మత్తులో ఉండగా డబ్బు కాజేసిందనే కోపంతోనే మహిత గొంతు కోసి మట్టుబెట్టినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. మధ్యవర్తి ద్వారా కేసును దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. శుక్రవారం తన కార్యాలయంలో నిందితుడిని మీడియా ఎదుట ప్రవేశపెట్టి దేవరకొండ డీఎస్పీ గిరిబాబు కేసు వివరాలు వెల్లడించారు. డిండి మండలంలోని గోనకోల్ గ్రామానికి చెందిన విభూది శ్రీలత దేవరకొండలో చిన్నా చితక పనులు చేసుకుంటూ జీవనం సాగించేది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా పుల్లెల చెరువు మండలం సిద్ధన్నపాలెం గ్రామానికి చెందిన బొమ్మన బోయిన సాంభయ్య వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తాను పండించే పత్తి, మిరప తదితర పంటలకు కూలీల అవసరం ఉండడంతో తొలుత దేవరకొండ ప్రాంతానికి చెందిన నర్సింహతో ఆ తర్వాత శ్రీలతతో పరిచయం ఏర్పడింది. వీరిద్దరు కూలీలను సమకూర్చేందుకు సాంభయ్యతో ఒప్పందం కుదుర్చుకున్నారు.

మద్యం మత్తులో ఉండగా..

ఈ ఏడాది జనవరి 29న దేవరకొండలో సాంభయ్య, శ్రీలత, నర్సింహ ముగ్గురు కలిసి మద్యం సేవించారు. ఈ క్రమంలోనే సాంభయ్య వద్ద నుంచి రూ.30వేల నగదు, సెల్‌ఫోన్‌ను శ్రీలత తస్కరించింది. శ్రీలత తన డబ్బులు, సెల్‌ఫోన్ దొంగలించినట్లు గుర్తించిన సాంభయ్య వాటిని తిరిగి ఇవ్వాలని శ్రీలతను కోరగా నిరాకరించింది. ఎన్ని సార్లు అడిగినా శ్రీలత స్పందించకపోవడంతో కోపం పెంచుకున్నాడు. ఈ క్రమంలోనే శ్రీలతను హతమార్చాలని నిర్ణయించుకున్న సాంభయ్య ఈనెల 13న దేవరకొండ ఆర్టీసీ బస్టాండు పక్కన ఉన్న ఓ భవనంపై ముగ్గురు కలిసి మద్యం సేవించారు. శ్రీలత మద్యం మత్తులో ఉండతో సాంభయ్య తన వెంట తెచ్చుకున్న కత్తితో ఆమె గొంతును కోసి హత్య చేసి పరారయ్యాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నర్సింహను విచారించగా కేసు మిస్టరీ వీడింది. ఈ మేరకు నిందితుడు సాంభయ్యను దేవరకొండలో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. కేసును ఛేదించిన సీఐ నర్సింహులు, ఎస్‌ఐలు డి.సైదులు, రమేశ్,నందులాల్‌లను, హెచ్‌సీఈ బాలునాయక్, తిరుపతి, రాజారాం, శంకర్, శ్రీధర్‌రెడ్డి, హోం గార్డులు సింహాద్రి, యాదయ్య, ఏడుకొండలు, సోమ్లాలను ఎస్పి చందనాదీప్తి అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.

డ్రగ్ అధికారుల తనిఖీలు

- అనుమతిలేని గోదాములో నిల్వ ఉంచిన రూ.4.23 లక్షల మందులు సీజ్


దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

కోదాడ: అనుమతిలేని గోదాములో మందులను నిల్వ ఉంచడంతోపాటు, గడువు తీరిన మందులు, శాంపిళ్లను అమ్ముతున్న వెటర్నరీ దుకాణంలో శుక్రవారం జిల్లా ఔషధ నియంత్రణ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో రూ.4.23 లక్షల విలువైన మందులతో పాటు గోదామును సీజ్ చేశారు. ఔషధ నియంత్రణ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడలోని హుజూర్‌నగర్ రోడ్డులో గల శ్రీసాయి నందిని వెటర్నరీ మెడికల్ ఏజెన్సీపై కొందరు ట్రోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో శుక్రవారం నల్లగొండ జిల్లా అసిస్టెంట్ డ్రగ్ కంట్రోలర్ కె.దాస్, సూర్యాపేట, నల్లగొండ, భువనగిరి డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు సురేందర్, సోమేశ్వర్, అశ్విని సదరు దుకాణంలో తనిఖీలు నిర్వహించారు. ఈ దుకాణ యజమాని అనుమతి లేకుండా గోదాము నిర్వహిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ గోదాములో రూ.6 వేల విలువ గల ఫిజిషియన్ శాంపిల్స్, రూ.17 వేల విలువ గల గడువు తీరిన మందులతో పాటు రూ.నాలుగు లక్షల విలువగల మందులను సీజ్ చేసినట్లు వారు తెలిపారు. వీటిని కోర్టుకు అప్పగించి దుకాణ యజమానిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బస్సులో వస్తుండగా బంగారు ఆభరణాలు చోరీ


బాధితురాలు కమలమ్మ

నేలకొండపల్లి: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న మహిళ బ్యాగ్ నుంచి బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ఈ ఘటన వివరాలు బాధితురాలి కథనం ప్రకారం ఇలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం సిరిపురం గ్రామానికి చెందిన శెట్టి కమలమ్మ శుక్రవారం ఆర్టీసీ బస్సులో కోదాడ నుంచి ఖమ్మం బయలుదేరింది. ఆమె పక్కన మరో మహిళ కూర్చోగా టికెట్ తీసుకునే సమయాన ఆధార్‌కార్డు కోసం బ్యాగ్ తెరిచి ఏడు తులాల బంగారు చంద్రహారం, నల్లపూసల గొలుసు ఉన్న చిన్న పర్స్ చూసుకుంది. అయితే, నేలకొండపల్లిలో ఆమెతో కూర్చున్న మహిళ దిగాక అనుమానంతో పర్స్ చూసుకుంటే గొలుసులు కనిపించలేదు. దీంతో కమలమ్మ కన్నీరుమున్నీరుగా విలపిస్తుండగా డ్రైవర్ బస్సు ఆపి మొత్తం తనిఖీ చేసినా ఆభరణాలు లభించకపోవడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.

యూనివర్సిటీ అభివృద్ధిలో పాలక మండలి పాత్ర కీలకం


మాట్లాడుతున్న వీసీ గోపాల్‌రెడ్డి

నల్లగొండ రూరల్: యూనివర్సిటీ అభివృద్ధిలో పాలక మండలి పాత్ర కీలకమని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీ గోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం యూనివర్సిటీలో పాలక మండలి వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించి సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విధానపరమైన నిర్ణయాలతో యూనివర్సిటీలో పని చేస్తున్న నిరుద్యోగులకు న్యాయం చేశామని, విద్యాపరమైన ప్రగతి శీల నిర్ణయాలతో యూనివర్సిటీ ఆదర్శ ప్రాయంగా నిలిచిందన్నారు. డిజిటల్ ద్వారా ప్రశ్న పత్రాలను మూల్యాంకనం చేస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో రిజిస్ట్రార్ అల్వాల రవి, అధ్యాపకులు అంజిరెడ్డి, శ్రీదేవి, ఆకుల రవి, బోయపల్లి కృష్ణారెడ్డి, ఘన శ్యామ్, కోటేశ్వర్‌రావు, సూర్యనారాయణరెడ్డి, సవీందర్‌కుమార్ , రమేష్, అరుణ ప్రియ , సుధారాణి, ప్రేమ్‌సాగర్, మద్దిలేటి, ఉపేందర్‌రెడ్డి, ఎంవీఎస్.రెడ్డి, ప్రశాంతి, రూప పాల్గొన్నారు.

పోలీసులకు నలుగురు మహిళల అప్పగింత

మోత్కూరు : మోత్కూరు మున్సిపల్ పరిధిలోని బుజిలాపురం గ్రామంలో శుక్రవారం అనుమానాస్పదంగా తిరుగుతున్న నలుగురు మహిళలను గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. గ్రామంలోని కాసగాని సత్తయ్య ఇంటి వద్ద పాడుబడిన ఇంటి తాళం పగులగొట్టి పాత ఇనుప సామగ్రి, ప్లాస్టిక్ సామాగ్రి సేకరిస్తున్న మహిళలను గ్రామస్తులు పట్టుకున్నారు. పోలీసుల విచారణలో సదరు మహిళలు నకిరేకల్ ప్రాంతానికి చెందిన వారని, దొంగలు కాదని, పాత ఇనుప సామాను, ప్లాస్టిక్ సామగ్రి సేకరించి విక్రయించుకునే వారని ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి చెప్పారు.

మహిళ మెడలో పుస్తెలతాడు చోరీ

కోదాడ: కోదాడ మండలం దోరకుంట శివారులో పశువులను తోలుకొని ఇంటికి వెళుతున్న ఓ మహిళ మెడలోని నాలుగు తులాల పుస్తెలతాడును గుర్తు తెలియని వ్యక్తులు లాక్కొని వెళ్లిపోయిన సంఘటన శుక్రవారం సాయింత్రం జరిగింది. చోరీ జరిగిన సంఘటన స్థలానికి కూతవేటు దూరంలోనే ఎస్పీ రాహుల్‌హెగ్డేతో పాటు ఇతర పోలీసు ఉన్నతాధికారులు ఉన్న సమయంలోనే ఈ చోరీ జరగడం ఆందోళన కల్గిస్తుంది. కోదాడ రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శిరంశెట్టి సరస్వతి గ్రామసమీపంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్ సమీపంలో పశువులను మేపుకొని సాయింత్రం ఇంటికి వెళుతోంది. మార్గమధ్యలో బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు ఆమె మెడలోని బంగారు పుస్తెల తాడు లాక్కొని పారిపోయారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోదాడ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నిలిచున్న ట్రాక్టర్‌ను ఢీకొని ఒకరి మృతి

హాలియా : నిలిచున్న ట్రాక్టర్‌ను అదుపుతప్పి బైక్ ఢీకొట్టడంతో ఒకరు మృతిచెందారు. ఈ ఘటన అనుముల మండలంలోని చింతగూడెం స్టేజీ వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. హాలియా మున్సిపాలిటీ పరిధిలోని ఇబ్రహీంపేట గ్రామానికి చెందిన ఆవుల వెంకన్న (42) వ్యవసాయ కూలీగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం తన పని నిమిత్తం బైక్‌పై నల్లగొండకు వెళ్లి తిరుగు ప్రయాణంలో స్వగ్రామానికి వస్తున్నాడు. మార్గమధ్యలో చింతగూడెం సమీపంలో బైక్ అదుపు తప్పి రోడ్డుపై ధాన్యం లోడుతో ఆగిన ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆవుల వెంకన్న తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు బంధువులు మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలం వద్దకు చేరుకొని ప్రమాదానికి కారణమైన ధాన్యం లోడు ట్రాక్టర్‌ను హాలియా పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

పురుగుల మందు తాగిన వ్యక్తి మృతి

భువనగిరి క్రైం : పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. భువనగిరి మండలం రాయగిరికి చెందిన దొమ్మాటి శంకర్(48) డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. ఐదేళ్ల క్రితం ఇతడి భార్య చనిపోయింది. కొంతకాలంగా మనోవేదనకు గురవుతున్న శంకర్ గురువారం పోచమ్మ గుడి వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన అతని బాబాయి కృష్ణస్వామి అతడిని భువనగిరి ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

వృద్ధురాలు అదృశ్యం

నార్కట్‌పల్లి : మండలంలోని ఔరవాణికి చెందిన వృద్ధురాలు అదృశ్యమైంది. గ్రామానికి చెందిన ముప్పిడి పిచ్చమ్మ (63) కూలి పని చేసుకుంటు జీవనం సాగిస్తోంది. గురువారం రాత్రి ఇంట్లో పడుకుని శుక్రవారం ఉదయం నుంచి కనపడడం లేదు. కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె తమ్ముడు యాదయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపారు.

వేర్వేరు చోట్ల నగదు, మద్యం పట్టివేత


అడవిదేవులపల్లి గ్రామ సమీపంలో బైక్‌ను తనిఖీ చేస్తున్న పోలీసులు


తిరుమలగిరి మండలం వెలిశాల చెక్‌పోస్టు వద్ద పట్టుబడిన నగదుతో పోలీసులు

చింతపల్లి : చింతపల్లి మండల కేంద్రంలోని గడియగౌరారం ఎక్స్ రోడ్డు వద్ద శుక్రవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టి రూ.5లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ యాదయ్య తెలిపారు. వెల్దండ శ్రీనివాస్ చింతపల్లి మండల కేంద్రం నుంచి తన స్వగ్రామమైన దేవరకొండ మండలం గొట్టిముక్కల గ్రామపంచాయతీ లింగన్నబావికి బైక్‌పై బ్యాగులో రూ.5లక్షలు తరలిస్తుండగా వాహనాల తనిఖీలో పట్టుకున్నట్లు తెలిపారు.

టెయిల్‌పాండ్ వద్ద రూ.2.69 లక్షలు..

అడవిదేవులపల్లి : పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున తెలంగాణ–ఆంధ్ర బార్డర్ అయినా టెయిల్‌పాండ్ వద్ద శుక్రవారం పోలీసులు తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఆంధ్రా నుంచి అడవిదేవులపల్లి వైపు వస్తున్న వ్యక్తి వద్ద రూ.2.69లక్షలను పట్టుకున్నట్లు ఎస్‌ఐ హరిబాబు తెలిపారు.

19 లీటర్ల మద్యం..

నార్కట్‌పల్లి: ఎన్నికల కోడ్ అమలులో భాగంగా నార్కట్‌పల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో అనుమతులు లేకుండా కొనసాగుతున్న బెల్ట్ షాపులను శుక్రవారం పోలీసులు తనిఖీ చేసి 19 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపారు. బెల్ట్ షాపుల్లో అక్రమంగా మద్యం విక్రయించినా, నిల్వ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రూ.1.36 లక్షల నగదు స్వాధీనం

త్రిపురారం : మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ ఎదుట శుక్రవారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. అనుమతులు లేకుండా ఓ వ్యక్తి తీసుకెళ్తున్న రూ.1.36లక్షలను సీజ్ చేశామని త్రిపురారం ఎస్‌ఐ వీరశేఖర్ శుక్రవారం తెలిపారు. హాలియా నుంచి బైక్‌పై మిర్యాలగూడ మండల పరిధిలోని ఈదులగూడెనికి వర్రె కొమరయ్య డబ్బులు తీసుకెళ్తుండగా స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

కుంటపల్లి చెక్‌పోస్టు వద్ద..

మద్దిరాల : మండల పరిదిలోని కుంటపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద శుక్రవారం వాహనాల తనిఖీలో రూ.3,34,770లు పట్టిబడింది. మహబూబాద్ జిల్లా తొర్రూర్ గ్రామానికి చెందిన గుగులోతు సూర్య వద్ద రూ.79,500లను,అదే విధంగా ఆత్మకూర్(ఎస్) మండల పరిదిలోని కొత్త తండాకు చెందిన బానోత్ లింగ వద్ద, బానోతు మగ్యా, అదే తండాకు చెందిన బానోతు రవి వాహనాల తనిఖీల్లో రూ.2,55,270లను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మధునాయుడు,ఎఫ్ఎస్‌టి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వెలిశాలలో రూ.1.24లక్షలు

తిరుమలగిరి : తిరుమలగిరి మండలం వెలిశాల చెక్‌పోస్టు వద్ద పోలీసులు శుక్రవారం రాత్రి వాహనాలను తనిఖీ చేసి రూ.1,24,928ల నగదును పట్టుకున్నట్లు ఎస్‌ఐ సత్యనారయణ తెలిపారు. హబూబాద్ జిల్లా హరిపిరాల గ్రామానికి చెందిన కె.శ్రీనివాస్‌కు చెందిన రూ.68,500లను,శాలిగౌరారం మండలం వట్టిపాముల గ్రామానికి చెందిన ఆర్.కృష్ణయ్యకు చెందిన రూ.56,420లను పట్టుకున్నట్లు తెలిపారు.ఆయన వెంట ఎస్ఓటీం అధికారులు సత్యనారయణ,మారయ్య తదితరులు పాల్గొన్నారు.

నగదు, మద్యం స్వాధీనం

కేతేపల్లి: కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ గ్రామ శివారులో టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద ఎస్‌ఐ శివతేజ తమ సిబ్బందితో కలసి శుక్రవారం వాహనాలు తనిఖీ చేశారు. విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న స్కార్పియో వాహనంలో సరైన పత్రాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.70 వేల నగదును స్వాధీనం చేసనుకుని సీజ్ చేశారు. ఇనుపాములలో అక్రమంగా మద్యం నిల్వచేసి విక్రయిస్తున్నారనే సమాచారంతో తనిఖీలు నిర్వహించి గోపయ్య ఇంట్లో 8.2 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుడిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ చెప్పారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ.. ఒకరి దుర్మరణం

హుజూర్‌నగర్ : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన హుజూర్‌నగర్ శివారులో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్‌కు చెందిన కోనుగంటి నర్సిరెడ్డి (52) మఠంపల్లి మండలంలోని ఓ సిమెంట్ పరిశ్రమకు చెందిన లారీ ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో నైట్ వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. నర్సిరెడ్డి బైక్‌పై హుజూర్ నగర్ నుంచి నైట్ డ్యూటీకి వెళుతున్నాడు. ఈ క్రమంలో పట్టణ శివారులోని మఖ్దూం నగర్ వద్దకు రాగానే హుజూర్‌నగర్ వైపు వస్తున్న లారీ ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను, మోటార్ సైకిల్‌ను ఢీ కొట్టింది. దీంతో నర్సిరెడ్డి కింద పడి తలకు తీవ్ర గాయమైంది. విషయం తెలుసుకున్న ఏఎస్‌ఐ బలరామిరెడ్డి, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు అప్పటికే అతను మృతిచెందాడు. పోలీసులు వివరాలు నమోదు చేసుకుని మతదేహాన్ని పట్టణంలోని ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. నర్సిరెడ్డికి భార్య కుమారుడు ఉన్నాడు. ఈ ప్రమాదంలో మరొకరికి గాయాలైనట్లు తెలిసింది. ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్ పరారయ్యాడు.

బైక్‌లు ఢీ కొని ఒకరికి గాయాలు

హుజూర్‌నగర్ పట్టణంలోని మెయిన్ రోడ్డులో గల విజయలక్ష్మి థియేటర్ సమీపంలో రెండు బైకులు ఢీ కొన్నాయి. ఈ ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. అతని పూర్తి వివరాలు తెలియరాలేదు.

స్తంభాన్ని ఢీకొట్టిన ట్రాక్టర్.. కూలీలకు తప్పిన ప్రమాదం


ట్రాక్టర్‌పై ఒరిగిన స్తంభం

సంస్థాన్ నారాయణపురం: మండలం కేంద్రంలోని బొర్రాయి ప్రాంతంలో శుక్రవారం ట్రాక్టర్ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో స్తంభం విరిగి ట్రాక్టర్ మీద వంగిపోయింది. గమనించిన స్థానిక యువకులు వెంటనే సబ్‌స్టేషన్‌కు ఫోన్ చేసి విద్యుత్ సరాఫరాను నిలుపుదల చేయించారు. విద్యుత్ సరాఫరా సకాలంలో నిలుపుదల చేయించడంతో ట్రాక్టర్ ట్రాలీలోని కూలీలకు పెను ప్రమాదం తప్పింది.

పీడీఎస్ బియ్యం పట్టివేత


పోలుమల్లలో పట్టుబడిన పీడీఎస్ బియ్యం

మద్దిరాల : ఇంట్లో నిల్వ చేసిన పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు.మండల మండల పరిధిలోని పోలుమల్లకు చెందిన ఆమంచి సత్తయ్య 21.5క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి ఇంట్లో నిల్వ చేశాడు. సమాచారం మేరకు దాడిచేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మధునాయుడు తెలిపారు.

ఆటో బోల్తా.. ఇద్దరికి తీవ్ర గాయాలు

వలిగొండ : ఆటో అదుపుతప్పి బోల్తా పడడంతో ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. వలిగొండకు చెందిన చంద్రతారా, మైసమ్మ మండలంలోని మొగిలిపాకలో బంధువుల ఇంట్లో జరుగుతున్న శుభకార్యానికి వెళ్లి ఆటోలో స్వగ్రామానికి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో మల్లెపెల్లి సమీపంలో ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టడంతో వారికి గాయాలయ్యాయి. స్థానికులు 108 సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి వెళ్లి వారిని భువనగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

జ్వర పీడితులకు పరామర్శ

ఇందుగుల, ఎర్రగడ్డలగూడెంలో రాష్ట్ర వైద్య బృందం పర్యటన

- రక్త నమూనాల సేకరణ
- ఫలితాల అనంతరం కారణాలు స్పష్టం చేస్తామని వెల్లడి
- గ్రామాల్లో వైద్య శిబిరాలు కొనసాగించాలని ఆదేశం


జ్వర బాధితులతో మాట్లాడుతున్న జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శివ బాలాజీ రెడ్డి


రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

మాడుగులపల్లి, రామగిరి(నల్లగొండ): మాడుగులపల్లి మండలంలోని ఇందుగుల, తిప్పర్తి మండలం ఎర్రగడ్డలగూడెం గ్రామాల్లో వైరల్ జ్వరాలు ప్రబలడంతో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ ఆర్‌వీ కర్ణన్ ఆదేశాల మేరకు శుక్రవారం ఆయా గ్రామాల్లో రాష్ట్ర వైద్య బృందం పర్యటించింది. వైద్య ఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ (సర్వైలెన్స్ అధికారి) డాక్టర్ శివబాలాజీ రెడ్డితోపాటు పలువురు జిల్లా వైద్యాధికారులు జ్వర పీడితులు, ఒంటి, కీళ్ల నొప్పులతో బాధపడుతున్న వారితో మాట్లాడి వ్యాధి లక్షణాలు అడిగి తెలుసుకున్నారు. బాధితుల రక్త నమూనా, తాగునీటి నమూనాలు సేకరించారు. బాధితుల ఇళ్ల పరిసరాలను పరిశీలించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, మురుగు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వారికి సూచించారు. జ్వర తీవ్రత తగ్గేంత వరకు వైద్య శిబిరాలను కొనసాగించాలని స్థానిక వైద్యాధికారులను ఆదేశించారు. అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. బాధితుల రక్త, తాగునీటి నమూనాలను హైదరాబాద్‌లోని (ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్)కు పరీక్షల నిమిత్తం పంపుతున్నట్లు తెలిపారు. అక్కడి నుంచి వచ్చిన ఫలితాల ఆధారంగా రెండు రోజుల్లో వైరల్ జ్వరాలు ప్రబలడానికి స్పష్టమైన కారణాలను వెల్లడిస్తామని పేర్కొన్నారు. అత్యుత్తమ వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. గురువారం ఇందుగుల గ్రామంలో 71 మందికి వైద్య పరీక్షలు చేయగా ఒకరికీ డెంగీ, నలుగురికి టైఫాయిడ్ పాజిటివ్ ఉన్నట్లు నిర్ధారించినట్లు స్థానిక వైద్యాధికారులు ఉన్నతాధికారులకు తెలిపారు. బాధితులందరికీ పరీక్షలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎపిడెమాలజిస్టు మోహన్, మైక్రో బయాలజిస్టు ముకుంటేశ్వర్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వేణుగోపాల్, వైద్యాధికారులు రాజేష్ కుమార్, డాక్టర్ రహ్మాన్ తహియా పాల్గొన్నారు.

❝ కీళ్ల నొప్పులు తీవ్రంగా ఉన్నాయి



జ్వరంతో కీళ్లనొప్పులు, ఒంటి నొప్పులతో సతమతమవుతున్నా. ఎప్పుడు జ్వరం వచ్చినా కొన్ని రోజుల్లో తగ్గేది.. ఇప్పుడు ఆ పరి స్థితి లేదు. రాత్రివేళ తీవ్రత ఎక్కువగా ఉంటోంది. జ్వరంతోపాటు ఒళ్లంతా పట్టేసినట్లు ఉంటోంది. కాళ్లు, చేతులు పని చేయడం లేదు. ప్రైవేటు ఆస్పత్రుల్లో భారీగా ఖర్చు పెట్టినా ఫలితం ఉండడం లేదు.
– సీహెచ్ రవీందర్‌రెడ్డి, జ్వర పీడితుడు, ఇందుగుల

❝ పరిసరాల శుభ్రత లేని కారణంగానే..



గ్రామాల్లో డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా ఉంది. మురుగు నిలిచి దోమలు విపరీతంగా ఉన్నాయి. ఇటీవల పర్యటించిన వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చాలాచోట్ల దోమ లార్వాలను గుర్తించారు. పరిసరాల పరిశుభ్రత లోపించిన కారణంగానే వైరల్ జ్వరాలు ప్రబలినట్లు ప్రాథమిక అంచనా. ఉన్నతాధికారులు ఈ వివరాలన్నింటిని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇదే విషయాన్ని రాష్ట్ర వైద్య బృందం సైతం ఉన్నతాధికారులకు నివేదించింది. వైద్య పరీక్షల్లో బాధితులకు టైఫాయిడ్, మలేరియా, డెంగీ (ఆర్థరైటిస్– ఆర్ఏ ఫ్యాక్టర్) నెగెటివ్ వస్తోంది. స్పష్టమైన కారణాలు తెలుసుకునేందుకు బ్లడ్ కల్చర్ పరీక్షకు రక్త నమూనాలను ల్యాబ్‌కు పంపాం. – ఇజాజ్ ఇక్తియార్, వైద్యాధికారి